# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-06-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1) దేశంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకే ప్రత్యేక సమగ్ర సవరణను కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిందని మంత్రి పి. నారాయణ తెలిపారు.**

**2) 'భారత్ నెట్ ఉద్యమి' కేంద్ర పథకం కింద చేపట్టిన సమృద్ధి గ్రామ ప్రాజెక్ట్ ద్వారా పౌర సేవలు, డిజిటల్ వైద్య సేవలు అందిస్తున్నట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ చెప్పారు.**

**3) పార్వతీపురం మన్యం జిల్లాలో మురుగు నీరు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు.**

**4) ఆటిజం బాధిత చిన్నారుల కోసం ప్రభుత్వం రాష్ట్రంలో 125 మున్సిపాలిటీల్లో ప్రత్యేక థెరపీ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది.**

==========================

దేశంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకే ప్రత్యేక సమగ్ర సవరణ –సర్‌ను కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిందని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని ఎల్లమ్మవారి దిన్నెలో జరుగుతున్న ప్రత్యేక సవరణ ప్రక్రియను ఆయన ఈరోజు పరిశీలించారు. ఇంటింటి సర్వేలో పాల్గొని బి.ఎల్.ఏ –బి.ఎల్.ఓ లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ…సర్… ప్రక్రియ వల్ల స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారవుతుందన్నారు.

--------------------------

'భారత్ నెట్ ఉద్యమి' కేంద్ర పథకం కింద చేపట్టిన సమృద్ధి గ్రామ ప్రాజెక్టు ద్వారా పౌర సేవలు, డిజిటల్ వైద్య సేవలు అందిస్తున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం నారాకోడూరులో, స్థానిక శాసన సభ్యులు ధూళిపాల నరేంద్రతో కలిసి ఆయన ఈరోజు సమృద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ..

వాయిస్…27 సెకన్లు

--------------------------

అమరావతిలోని హైకోర్టు శాశ్వత భవన అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం 547 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. ఈ నిధులను హైకోర్టు భవన బాహ్య వలయ వెలుపలి అభివృద్ధి, ఇతర పనుల కోసం ఖర్చు

చేస్తారు. పనుల పర్యవేక్షణ, తదుపరి చర్యలు తీసుకోవాలని సీఆర్‌డీఏ కమిషనర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాజధాని అమరావతిలోని సీఆర్డీఏ పరిధిలో పలు సంస్థలకు భూ కేటాయింపులను మంత్రి మండలి సిఫార్సుల మేరకు మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 118ని జారీ చేసింది. 94 కోట్ల 90 లక్షల రూపాయల వ్యయంతో అదనపు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

ప్రతి శుక్రవారం ఇంధన పొదుపు కోసం నో వెహికల్ డేగా పాటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు భవిష్యత్‌లో పెద్ద మార్పు తీసుకువస్తుందని నీటి పారుదల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి అమరావతి సచివాలయానికి మంత్రి నిన్న సైకిల్ మీద వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి రాత్రి విజయవాడకు సైకిల్ మీద చేరుకున్నారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ...

వాయిస్...30 సెకన్లు

---------------------------

భారత దేశంలోని పారిశ్రామిక వాడల్లో రెన్యువబుల్ ఎనర్జీని ఉపయోగించుకొని తక్కువ ఉద్గారాలు విడుదల చేసే అల్యూమినియం పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్.. రష్యాకు చెందిన రూసాల్ అల్యూమినియం సంస్దను కోరారు. రష్యా పర్యటనలో ఉన్నమంత్రి లోకేష్ ప్రపంచంలోనే అతిపెద్ద అల్యూమినియం సంస్థల్లో ఒకటైన రుసాల్ సంస్థ ప్రతినిధులతో సెయింట్ పీటర్స్ బర్గ్‌లో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... భారతదేశంలోని డీప్ వాటర్ పోర్టుల వద్ద ఉన్న ప్రత్యేక వాటర్‌ఫ్రంట్ బెర్తులు, క్రమబద్ధమైన కస్టమ్స్ క్లియరెన్స్‌లను ఉపయోగించుకొని ఒక కోస్టల్ అల్యూమినియం రిఫైనరీ, బాక్సైట్ దిగుమతి హబ్‌ను అభివృద్ధి చేయడానికి భాగస్వామ్యం వహించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

---------------------------

ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పార్వతీపురం మన్యం జిల్లా పెదపెంకిలో అభివృద్ధి పనులపై ఈరోజు అమరావతి నుండి సమీక్ష నిర్వహించారు. అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా సమీక్షిస్తూ ... గ్రామంలో పైలేరియాతో పాటు డెంగ్యూ, మలేరియా కేసులు ఎక్కువగా నమోదు కావడంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య కార్యక్రమాలు, మురుగు నీటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ సూచించారు.

---------------------------

ఆటిజం బాధిత చిన్నారుల కోసం రాష్ట్రంలో 125 మున్సిపాలిటీల్లో ప్రత్యేక థెరపీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు సమగ్ర శిక్షా కార్యక్రమం అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ కె.రవీంద్రనాథరెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న ఈ కేంద్ర నూతన భవన నిర్మాణ పనులను ఆయన నిన్న పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో దేశంలో మొదటిసారిగా రాష్ట్రంలోనే వీటిని అందుబాటులోకి తెస్తున్నామని.... రాష్ట్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలు 90 వేల మంది వరకు ఉన్నారని తెలిపారు. పరీక్షలు నిర్వహించి ఆటిజంతో బాధపడుతున్న వారిని ఇందులో చేరుస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఆటిజం థెరపీ సెంటర్‌లో ప్రత్యేక వైద్యులతో కూడిన ఏడుగురు పర్యవేక్షకులు అందుబాటులో ఉంటారని రవీంద్ర నాథ్ రెడ్డి తెలిపారు.

---------------------------

రాష్ట్ర పర్యాటక రంగానికి మరో జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం లభించింది. 'ఇండియా టుడే' సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించిన సర్వేలో విశాఖ –అరకు విస్టాడోమ్ రైలు ప్రయాణం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈ నెల 15న గోవాలో జరిగే అవార్డుల కార్యక్రమంలో పురస్కారం అందుకోవాలని ఇండియా టుడే సంస్థ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందులు దుర్గేష్‌ను ఆహ్వానించింది. విశాఖ –అరకు విస్టాడోమ్ రైలు ప్రయాణం దేశంలోనే మొదటి స్థానంలో నిలవటం పట్ల పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు రాబోయే రోజుల్లో రాష్ట్రంలో పర్యాటక రంగాభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

---------------------------

కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మారుమూల ప్రాంతాల్లో ఉన్న నిరుపేదల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయి. ముఖ్యంగా మహిళలు, యువతులలో చైతన్యాన్ని తీసుకువచ్చేందుకు అమలు చేస్తున్న కిశోర్ బాలికా  వికాస పథకం సత్ఫలితాలను ఇస్తోంది. తిరుపతి జిల్లాలో ఈ పథకం అమలు తీరును శ్రీకాళహస్తి డివిజన్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అధికారి శాంతి దుర్గ వివరిస్తూ..

వాయిస్…20  సెకన్లు

---------------------------

మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తే సంచలనాలు సృష్టిస్తారని పౌర సరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఏలూరులో  జిల్లా గ్రామీణ అభివృద్ధిసంస్థ –సెర్ప్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం పట్ల మహిళలకు అవగాహన కల్పించాలని అన్నారు. మహిళల అభివృద్ధి కుటుంబాల పురోగతికి, సమాజ శ్రేయస్సుకు మూలాధారమని పేర్కొన్నారు. మహిళలు ఆర్థిక వ్యవహారాలపై పూర్తి అవగాహన కలిగి ఉండటం ద్వారా కుటుంబ ఆర్థికస్థితి మరింత బలోపేతం అవుతుందని మనోహర్ తెలిపారు. ప్రభుత్వం మహిళల సాధికారతకు ప్రాధాన్యతను ఇస్తూ అనేక సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 21న నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి ప్రభుత్వం 10 కోట్ల రూపాయల నిధులను విడుదల చేసింది. సుమారు 25 వేల మందితో రాష్ట్ర స్థాయిలో ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. ఈనెల 21న కృష్ణా నది వెస్ట్ బైపాస్ వంతెనపై యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రధానంగా నిర్వహించనున్నారు.

======================